సాక్షి అనకాపల్లి

గురువారం । 10 । ఆగస్టు । 2023



నా భూమి నాదేశం

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్లో నా భూమి-నా దేశం కార్యక్రమాన్ని ఆర్డీవో జయరాం, చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి ప్రారంభించారు.



నృత్య హేల

విశాఖ: టీటీడీ కల్యాణమండపంలో శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.



హుండీ లెక్కింపు

విశాఖ: కనకమహాలక్ష్మి ఆలయ హుండీ లెక్కించారు. గత నెల 10 నుంచి ఈ నెల 9 వరకు రూ.19 లక్షల ఆదాయం లభించింది.

న్యూస్‌రీల్

ప్రసాద్ పథకంలో నూకాంబిక ఆలయం

పార్లమెంట్‌లో ఎంపీ సత్యవతి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: అనకాపల్లిలోని శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చాలని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డికి అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో సంప్రదాయ కళలు భరతనాట్యం, కూచిపూడి, తప్పెటగుళ్లు, సమీప అరకులో థింసా నృత్యంలో నిష్ణాతులైన కళాకారులున్నారని తెలిపారు. వారి కోసం ఒక సాంస్కృతిక కేంద్రం ఏర్పాటు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మోనోజైట్ నిక్షేపాలకై అన్వేషణ

పశ్చిమగోదావరి కుమ్మరపురుగుపాలెం, శ్రీకాకుళం జిల్లాలోని కవిటిలో తీర ప్రాంతాల్లో మోనోజైట్ నిక్షేపాలు గుర్తించడానికి అన్వేషణ చేస్తున్నట్లు పీఎంవో సహాయమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం ఎంపీ బి.వి.సత్యవతి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఇన్-సిటు మోనోజైట్ 13.07 మిలియన్ టన్నుల నిక్షేపాలున్నాయని చెప్పారు.

సినాప్టిక్స్ పరిశ్రమలో రసాయన ద్రావణం లీక్

చెలరేగిన మంటలు



కాలిన భాగం

రాంబిల్లి: సినాప్టిక్స్ పరిశ్రమలో బుధవారం రసాయన ద్రావణం లీకై మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు పరిశీలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం గానీ, గాయాలు గానీ ఎవరికీ కాలేదని ఎస్‌ఐ దీనబంధు తెలిపారు.

వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుకు దరఖాస్తులు

అనకాపల్లి టౌన్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని విశిష్ట ప్రతిభ కనబరిచిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. తగిన ఆధారాలతో దరఖాస్తును ఒక పేజీకి మించకుండా చిరునామా, ఫోన్‌నంబర్, ఈ మెయిల్, ప్రతిభా వివరాలతో ఈమెయిల్‌ను sportsinap@gmail.com&dsa. vsp@rediffmailలకు ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు పంపుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ రమణ తెలిపారు.

నేడు తాండవ నీటి విడుదల



జేఈలకు సూచనలిస్తున్న డీఈ స్వామినాయుడు

నాతవరం: తాండవ రిజర్వాయరు నుంచి అయకట్టు భూములకు నీటిని విడుదల చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తాండవ ప్రాజెక్టు డీఈ స్వామినాయుడు తెలిపారు. బుధవారం ఆయన జలాశయ జేఈలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు తాండవ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల తేదీని అయకట్టుదారులు, ప్రజాప్రతినిధుల అభీష్టం మేరకు నిర్ణయించామన్నారు. ఈ నెల 10న మధ్యాహ్నం 1.08 నిమిషాలకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ చేతల మీదుగా ప్రధాన గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తామన్నారు. దీనిపై ఇప్పటికే తుని ఎమ్మెల్యే, మంత్రి దాడిశెట్టి రాజా, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌కు, ప్రాజెక్టు పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయకట్టుదారులకు సమాచారం అందించామన్నారు. తాండవ ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 380 అడుగులని, ప్రస్తుతం 370.2 అడుగుల మేర నీటి నిల్వలున్నట్లు తెలిపారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయకట్టుదారులను కోరారు. నీటి విడుదల సమయం నుంచి కాలువల వెంబడి తమ సిబ్బంది పర్యవేక్షణ నిత్యం ఉండేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జేఈలు రామకృష్ణ, శ్యామ్‌కుమార్, వినయ్‌కుమార్, పాత్రుడు, నాగబాబు, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె ముంగిట రిజిస్ట్రేషన్ సేవలు

- భూసర్వే పూర్తయిన గ్రామ సచివాలయాల్లో అందుబాటులోనికి..
- ప్రస్తుతం జిల్లాలో 129 చోట్ల ఈ సౌకర్యం ప్రారంభం
- రెండు నెలల కాలంలో 141 రిజిస్ట్రేషన్లు
- ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా



రిజిస్ట్రేషన్ కోసం వివరాలను కంప్యూటరీకరిస్తున్న సచివాలయ సిబ్బంది



గొందుపాలెం సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి పత్రాల అందజేత

కె.కోటపాడు: గ్రామ సచివాలయాల్లోనే ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వే కార్యక్రమం, రైతులకు పాస్ పుస్తకాల మంజూరు ప్రక్రియ పూర్తయిన సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతున్నాయి. జిల్లాలో మొదటి విడతలో కోటవురట్ల మండలం చౌల్లంగిపాలెం, అచ్యుతాపురం మండలం గంగమాంబ అగ్రహారం సచివాలయాల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రెండో విడతలో ఈ ఏడాది జూన్ 3న 127 సచివాలయాల్లో సబ్ రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమయ్యాయి.

ప్రయాణ ఖర్చు, సమయం ఆదా

ప్రస్తుతం అనకాపల్లి, లంకెలపాలెం, కె.కోటపాడు, మాడుగుల, చోడవరం, నర్సీపట్నం, కోటవురట్ల, నక్కపల్లి, యలమంచిలి, సబ్బవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలకు అందుతున్నాయి. సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్టిగేజ్, వీలునామా, మ్యారేజ్ రిజిస్ట్రేషన్‌తోపాటు ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), సర్టిఫైడ్ సర్టిఫికెట్లు (సీసీ) మంజూరు చేసే ప్రక్రియ ఈ కార్యాలయాల ద్వారా జరుగుతోంది. మొదటి, రెండు విడతల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమైన 129 సచివాలయాల్లో రెండు నెలల కాలవ్యవధిలోనే 141 లావాదేవీలు జరిపారు. సబ్ రిజిస్ట్రార్ బాధ్యతను గ్రామ సచివాలయ కార్యదర్శి, రిజిస్ట్రేషన్ పత్రాల కంప్యూటరీకరణను సచివాలయాల్లో గల డిజిటల్ అసిస్టెంట్లు నిర్వహిస్తున్నారు. సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు ప్రారంభించడంతో స్థానికంగానే కొనుగోలు, అమ్మకాల ప్రక్రియ పూర్తికావడంతోపాటు ఈసీ, సీసీ సర్టిఫికెట్ల మంజూరు జరగడం వలన ప్రయాణ ఖర్చులు, సమయం ఆదా అవుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ సేవలపై అవగాహన

రీసర్వే పూర్తవుతున్న గ్రామాల జాబితా ప్రకారం ఆయా పరిధిలో గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు సచివాలయాల కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లకు సేవలు నిర్వహించే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. సంబంధిత శాఖకు చెల్లించే చలానా నగదును లెక్కించడంతోపాటు స్టాంప్ డ్యూటీ వివరాలను తెలుపుతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ అనంతరం థంబ్ ఇంప్రెషన్ (టీఐ) సేకరణలో శిక్షణను ఇస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా జరగడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సచివాలయ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లకు సబ్ రిజిస్ట్రార్లు వివరిస్తున్నారు.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్ కార్యక్రమం



ఇప్పటి వరకు జిల్లాలోని 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా సేవలు అందిస్తున్నాం. వీటితో పాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సర్వే పూర్తయిన గ్రామాల సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే మొదటి, రెండు విడతల్లో జిల్లాలో 129 సచివాలయాల్లో ఈ సేవలను ప్రారంభించాం. ప్రజలు ఈ సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

-జానకీదేవి, రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ జిల్లా రిజిస్ట్రార్, అనకాపల్లి

అనుమానం ఉంటే నివృత్తి



సచివాలయాల్లో చేపట్టే రిజిస్ట్రేషన్ కార్యక్రమాలపై ఇప్పటికే పలుమార్లు అవగాహన కల్పించాం. ఇంకా ఏమైనా అనుమానాలు ఉంటే సచివాలయ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లకు నివృత్తి చేయనున్నాం. కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో గల కె.కోటపాడు మండలంలో పది సచివాలయాలు, దేవరాపల్లి మండలంలో రెండు సచివాలయాల్లో ఈ రిజిస్ట్రేషన్ సేవలు సాగుతున్నాయి. ఈ సచివాలయాల కార్యదర్శులకు వేలిముద్రల నమోదు రిజిస్టర్, అకౌంట్-ఏ రిజిస్టర్లను అందించాము.

-బి.వెంకటేశ్వరరావు, సబ్ రిజిస్ట్రార్, కె.కోటపాడు

కల్యాణమస్తు, షాదీ తోఫాతో విద్యకు ప్రోత్సాహం

- చెక్కు అందించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- జిల్లాలో 1,133 జంటలకు రూ.6.78 కోట్ల లబ్ధి



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ సత్యవతి

తుమ్మపాల: జిల్లాలో 1,133 జంటలకు కల్యాణమస్తు, షాదీ తోఫా పథకంలో రూ.6 కోట్ల 78 లక్షల 30 వేలు ఆర్థిక సాయం మంజూరు చేసినట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకం-2023 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలో వర్చువల్ విధానంలో ప్రారంభించగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి వీక్షించారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న లబ్ధిదారులైన నూతన జంటలకు చెక్కు రూపంలో ఈ నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహానంతరం ఆర్థిక కారణాలతో మధ్యలోనే చదువు ఆపేస్తున్న యువతకు ఈ పథకాలతో ఎంతగానో లబ్ధి చేకూరుతుందన్నారు. పథకం లబ్ధికి చదువును ప్రామాణికంగా తీసుకోవడంతో విద్యను మధ్యలోనే నిలిపేసే అవకాశం తగ్గుతుందన్నారు. ఈ పథకాలు సామాజిక మార్పుల్లో ఒక విశిష్టమైన పాత్రను పోషిస్తాయనడంలో సందేహం లేదన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ అజయ్‌బాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం, ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసు

అనకాపల్లి రూరల్: విద్యార్థుల నోటు పుస్తకాల మూల్యాంకనంతోపాటు బోధన సక్రమంగా చేపట్టకపోవడంతో ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడికి డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం తాఖీదులు జారీ చేశారు. కూండ్రం జెడ్పీ హైస్కూల్‌ను ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల వర్క్‌బుక్‌లు, రాత పుస్తకాలను పరిశీలించారు. వాటిని ఉపాధ్యాయులు సక్రమంగా మూల్యాంకనం చేయలేదని గుర్తించారు. 5వ తరగతి సాంఘికశాస్త్రం బోధిస్తున్న కె.శ్రీనివాస్, 3వ తరగతి ఆంగ్లం బోధిస్తున్న బి.రామారావులపై డీఈవో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో పర్యవేక్షణ సక్రమంగా చేపట్టని ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కె భాస్కర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇటీవల పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లాలో పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యా బోధనతోపాటు పర్యవేక్షణ పకడ్బందీగా చేపట్టాలని డీఈవోకు సూచించారు. దీంతో తాజాగా డీఈవో వెంకటలక్ష్మమ్మ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో నకి‘లీలలు’

- స్టాఫ్ నర్సు నియామకంలో విశాఖ డీఎంహెచ్‌వో పేరుతో నకిలీ ఆర్డర్
- ఆర్డర్ చూసి షాకైన సిబ్బంది, పోలీసులకు ఫిర్యాదు
- ఇంకా ఎన్ని ఆర్డర్లు ఉన్నాయోనన్న అనుమానం



డీఎంహెచ్‌వో ఆఫీసు

మహారాణిపేట (విశాఖ): వైద్య ఆరోగ్య శాఖలో నకిలీలు వదిలి పెట్టడం లేదు. ఒక వైపు ఫేక్ సర్టిఫికెట్లు.. మరోవైపు నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు వైద్య ఆరోగ్యశాఖను కుదిపేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితమే నకిలీ ఆర్డర్ల వ్యవహారం తీవ్ర దుమారం రేపగా.. తాజాగా అదే తరహా మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తాజాగా స్టాఫ్ నర్సు పోస్టు కోసం బి.రమాదేవి అపాయింట్‌మెంట్ ఆర్డర్ విశాఖ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు పేరుతో రావడం కలకలం రేపుతోంది. గత రెండేళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ రకాల పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే మెజార్టీ పోస్టులను భర్తీ చేశారు. ఇదిలా ఉంటే అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం వంతల గ్రామానికి చెందిన బి.రమాదేవి అరకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్టాఫ్ నర్సుగా అపాయింట్‌మెంట్ అందజేసింది. ఆ నియామక పత్రాన్ని పరిశీలన నిమిత్తం మూడు జిల్లాల నోడల్ ఆఫీసర్ అయిన విశాఖ డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపించారు. అందులో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పేరుతో అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఉండడాన్ని సిబ్బంది గమనించారు. ఆ నియామక జాబితాను పరిశీలించగా అందులో ఆమె పేరు లేనట్లు గుర్తించారు. దీంతో ఆ అపాయింట్‌మెంట్ లెటర్ ఫేక్ అని నిర్ధారణకు వచ్చారు.

గతంలో 11 నకిలీ ఆర్డర్లు గుర్తింపు

ఇదే తరహాలో 2020 నుంచి ఇప్పటివరకు 11 నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అధికారులు గుర్తించారు. గత డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సూర్యనారాయణ పేరుతో నియామక ఉత్తర్వులు వెలుగు చూశాయి. ముంచంగిపుట్టు, భీమవరం పీహెచ్‌సీ, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, చింతపల్లి సీహెచ్‌సీ, సీలేరు పీహెచ్‌సీ ఇలా మరికొన్ని ప్రాంతాల నుంచి వచ్చిన నకిలీ ఆర్డర్లు అధికారులను విస్తుపోయేలా చేశాయి.

పోలీసులకు ఫిర్యాదు

రమాదేవి నియామక ఉత్తర్వు నకిలీదని గుర్తించిన డీఎంహెచ్‌వో అధికారులు ఆ విషయాన్ని అల్లూరి జిల్లా అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రమాదేవిని పిలిపించి ఆ ఆర్డర్ ఎవరు ఇచ్చారన్న విషయంపై ప్రశ్నించారు. బి.ఎస్.రాజు రూ.2.50 లక్షలు తీసుకొని ఆర్డర్ ఇచ్చారని ఆమె అధికారులకు సమాధానమిచ్చింది. దీనిపై అల్లూరి జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు జి.మాడుగుల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

• ఆదివాసీల ఆనంద హేల



చిదతల కోలాటం.. థింసా నృత్యం.. స్వచ్ఛమైన గిరి పరిమళంతో ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరిగింది. నర్సీపట్నంలో బుధవారం గిరిజన ఉద్యోగుల సంఘం నిర్వహించిన ఈ వేడుకలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. -8లో

బీచ్ టూరిజం అభివృద్ధికి చర్యలు

- ముందస్తు చర్యలతో ప్రమాదాల నియంత్రణ
- వివిధ శాఖల సమీక్షలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



కోస్టల్ జోన్ మాస్టర్ ప్లాన్, డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: రాష్ట్రంలో బీచ్ టూరిజం అభివృద్ధిలో భాగంగా జిల్లాలోని తీరప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు 25 ప్రదేశాలను గుర్తించినట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కోస్టల్ జోన్ మాస్టర్ ప్లాన్‌లో పర్యాటక రంగానికి చెందిన అంశాలపై అధికారులతో చర్చించారు. సముద్ర తీరం ఆహ్లాదకరంగా ఉంటుందని, వినోదం, బోటింగ్, సాహస జల క్రీడల అనుభూతులను అందించడం ద్వారా బీచ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేయవచ్చన్నారు. దీనికి సంబంధించి ఎంపిక చేసిన ప్రాంతాలలో మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులను సూచించారు. పర్యాటక, మత్స్యశాఖ, రిసెర్చ్ స్కాలర్లతో శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేయించి బీచ్‌లను గుర్తించాలన్నారు.

అనంతరం నిర్వహించిన డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాలు నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టడం, ప్రమాద సమయంలో తీసుకోవల్సిన అత్యవసర చర్యలపై వివిధ శాఖల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాల నివారణకు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రతి పరిశ్రమ నుంచి ఒక వ్యక్తిని ఎంపిక చేయాలన్నారు. ప్రమాదం జరిగినపుడు తక్షణ చర్యల కోసం అతన్ని వినియోగించుకోవాలన్నారు. దీని కోసం ఆన్‌లైన్ ఎమర్జెన్సీ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రమాదాల తక్షణ నివారణకు అన్ని శాఖల అధికారులకు సమాచారం చేరేలా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని సూచించారు. మాక్ డ్రిల్ సమయంలో తప్పనిసరిగా వీడియో తీయాలన్నారు. ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ పరిశ్రమల్లోని అన్ని విభాగాల్లో అప్రమత్తంగా ఉంటూ, ప్రమాదం జరిగిన వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం ఇవ్వాలన్నారు. దీనిపై నిపుణుల సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, టూరిజం రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస పాణి, పీసీబీ ఈఈ నాగిరెడ్డి, జిల్లా టూరిజం అధికారి కె.అశోక్, డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీపీఆర్వో ఇంద్రావతి, డీఎంహెచ్‌వో హేమంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మైచర్లపాలెంలో పోలీస్ పికెట్



గ్రామంలో వివాదం గురించి ఆరా తీస్తున్న సీఐ

చోడవరం రూరల్: మైచర్లపాలెం గ్రామ సర్పంచ్ బూరె మాణిక్యంపై దాడికి యత్నించిన ఘటనలో ఇరు వర్గాల మధ్య కొట్లాట జరగడంతో బుధవారం సాయంత్రం నుంచి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. సాగునీటి కాలువల్లో పూడిక తవ్వకం, చెరువులోని చేపల వేలం పాట నిర్వహణ విషయమై గ్రామ సభ జరుగుతుండగా వివాదం చెలరేగింది. సర్పంచ్‌ను వ్యతిరేకించడంతోపాటు మాజీ సర్పంచ్ బూరె కనక నర్సింహం తన వర్గీయులతో దాడికి పాల్పడ్డారు. సర్పంచ్‌ను రక్షించే యత్నంలో వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ సర్పంచ్ బూరె శంకరరావు, సర్పంచ్ సోదరులు బూరె సత్తిరాము, బూరె అప్పారావు, మైచర్ల మహాలక్ష్మినాయుడులకు గాయాలయ్యాయి. వారితోపాటు గాయపడిన మరో నలుగురిని ఆస్పత్రులకు తరలించారు. సాగునీటి కాలువల అభివృద్ధి, చెరువు చేపల వేలంపాట విషయమై గ్రామంలోని ఇరువర్గాల మధ్య కొట్లాట చోట చేసుకుందని, దీనిని రాజకీయ కోణంలో చూడరాదని చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు అన్నారు. ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు రెండు వర్గాలవారిపైనా కేసులు నమోదు చేశామని చెప్పారు.

మానసిక వైద్యశాల విద్యార్థిని చందన ప్రతిభ



చందన

ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక వైద్యశాలలో విద్యనభ్యసిస్తున్న ఎండీ సైకియాట్రీ విభాగం విద్యార్థిని ఎస్.చందన పీజీ పరీక్షల్లో 458 మార్కులు సాధించింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన పీజీ పరీక్షల్లో సైకియాట్రీ విభాగంలో ఆమె అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమెను ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వి రామిరెడ్డి అభినందించారు.

వైఎస్సార్‌తోనే డీసీఎంఎస్‌లకు జవసత్వాలు

డీసీఎంఎస్ నూతన చైర్మన్‌గా నర్సింగరావు ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్ పల్లా నర్సింగరావు, వేదికపై ప్రభుత్వ విప్ ధర్మశ్రీ తదితరులు

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో శిథిలావస్థకు చేరుకున్న జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లకు దివంగత రాజశేఖర్‌రెడ్డి పాలనలో రుణమాఫీ చేసి జీవం పోశారని, డీసీఎంఎస్‌లకు జిల్లాలో పూర్వ వైభవం తీసుకొచ్చేలా స్థానిక మంత్రులు, ఎంపీ సహకారం తీసుకుంటామని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో బుధవారం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. కో ఆపరేటివ్ వ్యవస్థ గాజు బొమ్మలాంటిదని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పార్టీ కోసం శక్తి వంచన లేకుండా కృషిచేసిన వారికి ఎదో ఒకరోజు సముచిత స్థానం లభిస్తుందని, అప్పటివరకూ ఓపిక పట్టాలని సూచించారు. సీఎం జగన్ పాలనలో బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని, బ్యాక్ బోన్ అని కొనియాడారు. ఈ నెల 13న చోడవరంలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశానికి అందరూ హాజరుకావాలని కోరారు. నూతన చైర్మన్ పల్లా నర్సింగరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన పార్టీ అధిష్టానానికి రుణపడి ఉంటానన్నారు. ఈ పదవి రావడంతో తన బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. డీసీఎంఎస్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటుపడతానన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బీసీలను గత ప్రభుత్వాలు ఓటర్లుగా మాత్రమే గుర్తించాయని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీ కులాలకు చెందిన వ్యక్తులకు ఉన్నత స్థానాలు కల్పించి, వారి స్థాయిని పెంచారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి మాట్లాడారు. అనంతరం డీసీఎంఎస్ నూతన కమిటీ చైర్మన్ పల్లా నర్సింగరావుతో పాటు కమిటీ సభ్యులు పొంద్రంగి అప్పారావు, బి.అప్పలనరస, పి.డి.నర్సింగరావు(గాంధీ), ఎన్.సుంకరయ్య, జి.సత్యదేవ్‌లు ప్రమాణస్వీకారం చేశారు. నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన పల్లా నర్సింగరావు, ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీలను నూతన కమిటీ సభ్యులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, పార్టీ నేతలు ఏడువాకల సత్యారావు, కాండ్రేగుల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అంతకు ముందు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ డీసీఎంఎస్ కార్యాలయ ఆవరణలో ఉన్న సొసైటీ వ్యవస్థాపకుడు బొడ్డేడ అచ్చియ్యనాయుడు విగ్రహానికి, నూతన చైర్మన్ నర్సింగరావుతో కలిసి పూల మాల వేసి నివాళులర్పించారు. పార్టీ కోసం పనిచేసేవారిని అధిష్టానం తప్పక గుర్తుంచుకుంటుందని, అందుకు నర్సింగరావే నిదర్శనమన్నారు.



అచ్చెయ్యనాయుడు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బొడ్డేడ ప్రసాద్, పల్లా నర్సింగరావు

సహకార సంఘాల అధ్యయనానికి ప్రత్యేక బృందం

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 25 సంఘాలు ఎంపిక



అధ్యయన యాత్రకు వెళ్తున్న సీఈవోల బృందానికి స్వాగతం పలికిన పాయకరావుపేట సంఘ నాయకులు

నక్కపల్లి/పాయకరావుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 25 పీఏసీఎస్‌లను ఎంపిక చేసి వాటి సీఈవోలను కాకినాడ, కోనసీమ జిల్లాలకు పంపించింది. బుధవారం ఈ బృందం ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లింది. వీరు కాకినాడ జిల్లా ర్యాలీ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా తొర్రేడు పీఏసీఎస్‌లను సందర్శిస్తుంది. సంఘాల పనితీరును మరింత పెంచేందుకు అధ్యయన యాత్ర నిర్వహిస్తున్నట్టు డీసీసీబీ వర్గాలు తెలిపాయి. రైతులకు రుణాలు అందిస్తూ సంఘాల బలోపేతానికి తొర్రెడు, ర్యాలీ సంఘాలు సత్ఫలితాలు సాధిస్తున్నాయి. ఈ రెండు సంఘాల టర్నోవర్, రుణ వితరణ, రికవరీ శాతం, రకవరీకి తీసుకుంటున్న చర్యలు ఈ సంఘాల నుంచి తెలుసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. జిల్లా పిఏసీఎస్‌ల డెవలప్‌మెంట్ మేనేజర్ జి.వి.ఎస్.ఎన్ రాజు నేతత్వంలో అధ్యయనానికి వెళ్తున్న ఈ బృందానికి డీసీసీబీ సీఈవో వర్మ జెండా ఊపి ప్రారంభించారు. పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, సీఈవో భూషణంలు స్వాగతం పలికి ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. అధ్యయనానికి వెళ్లే సంఘాల్లో పి.లక్కవరం, కలిగొట్ల, ఎం.కె.వల్లాపురం, మాడుగుల, లక్ష్మీపురం, ములకాలపల్లి, దేవరాపల్లి, నాగులాపల్లి, తుంపాల, పాయకరావుపేట, చూచుకొండ, కొండకర్ల, రోలుగుంట, చౌడువాడ, చోద్యం రాంబిల్లి, బుచ్చియ్యపేట, నాతవరం, నర్సీపట్నం, దిమిలి, వీరనారాయణం, తిమ్మరాజుపేట, చోడవరం, గొడిచర్ల, నక్కపల్లి సంఘాల సీఈఓలు ఉన్నారు.

రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా పాలన

- మాదిగలకు ఎమ్మెల్సీ ఇచ్చిన ఘనత జగనన్నదే
- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్



పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయెల్

నక్కపల్లి/ పాయకరావుపేట: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా పరిపాలన సాగుతోందని, ఏ ఒక్క నాయకుడికి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని, మాదిగలకు ఎమ్మెల్సీ పదవి కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నదేనని ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ అన్నారు. బుధవారం ఆయన పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మాదిగలకు ఎమ్మెల్సీ పదవిని కేటాయించి తనను ఎంపిక చేసారన్నారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందిస్తున్నారన్నారు. గతంలో వరదల సమయంలో బాధిత గ్రామాల్లో చంద్రబాబు హెలీకాప్టర్‌లో మాత్రమే పర్యటించేవారన్నారు. హంగులు, ఆర్భాటాలు తప్ప బాధితులకు ఒక్క పైసా కూడా విడుదల చేసే వారు కాదన్నారు. జగనన్న అలా కాదని, అల్లూరి సీతారామరాజు జిల్లా ఉభయ గోదావరి, కోనసీమ జిల్లాల్లో లంక ప్రాంత గ్రామాల్లో ఇటీవల వచ్చిన వరదల వల్ల ఇబ్బందిపడుతున్న బాధిత గ్రామాల్లో రోడ్డుమార్గంలో ప్రయాణించి వరద బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై థ్యాంక్యూ సీఎం పేరుతో రాష్ట్రంలో అన్ని గ్రామాల్లోను పర్యటిస్తామని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తెలిపారు. సమావేశంలో మాదిగ రక్షణ పోరాట సమితి అధ్యక్షుడు ఆరుగల మోషే, ఎంపిఆర్‌పిఎస్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్



గిరిజన యువతుల చిడతల కోలాటం



వేడుకలకు హాజరైన గిరిజన ఉద్యోగులు

నర్సీపట్నం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నంలో మొట్టమొదటిసారి నిర్వహించిన ఈ వేడుకలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. థింసా నృత్యం, చిడతల కోలాటంతో వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. వేడుకల నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు ప్రభుత్వం ఉండగా ఉంటుందన్నారు. ట్రైబల్ అడ్వైజర్ కమిటీలో మెంబరుగా ఉన్నందుకు గర్వపడుతున్నానన్నారు. ఏ సమస్య వచ్చినా ఆదివాసీలకు తాను అండగా ఉంటానన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘానికి తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. గిరిజన ఉద్యోగులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, సంఘం అధ్యక్షులు ఎస్.ధనార్జున్, జనరల్ సెక్రటరీలు ఎస్.ధర్మరాజు, జె.సింహాచలం, ఉపాధ్యక్షులు శ్రావణ్‌కుమార్, కె.లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు సోమయ్య, జి.పంతులు బాబు, కె.బాబు, గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు.

భవనాల తొలగింపు వేగవంతం చేయాలి



భవనాల తొలగింపును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్

అనకాపల్లిటౌన్: స్థానిక పెరుగుబజారు– రైల్వేస్టేషన్ రహదారి విస్తరణకు సిద్ధమవుతున్న ప్రాంతాన్ని బుధవారం శిక్షణ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ పరిశీలించారు. విస్తరణకు అడ్డంగా ఉన్న భవన సముదాయాల తొలగింపును వేగవంతం చేయాలని జోనల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ వెంకటరమణ, జోనల్ సిబ్బంది, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి



ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో స్పష్టమైన, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి వివిధ రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని జిల్లా ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ అధికారి, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క ఓటరు జాబితాలో నమోదు కావాలన్నారు. ప్రస్తుతం రూపొందిస్తున్న ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు, సవరణలను ప్రతివారం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. రానున్న పది రోజుల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి కానుందని, జాబితా స్వచ్ఛీకరణకు గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించామన్నారు. ఓటు తొలగించే సమయంలో ఫారం–7 తప్పనిసరి, బీఎల్వో రిపోర్టు, స్పష్టమైన డాక్యుమెంట్ ఉండాలన్నారు. ఏ వార్డులో అయినా రెండుకు మించి ఓటర్లను తొలగించవలసి వచ్చినప్పుడు ఈఆర్వో సమక్షంలో జరగాలన్నారు. రాజకీయ పార్టీలు ప్రతి వార్డుకు తమ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి బూత్ స్థాయి అధికారికి సహకరించాలన్నారు. ఓటర్ల నమోదుపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రసార మాధ్యమాల్లో ప్రకటనలు, గ్రామాల్లో దండోరా వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, డీఆర్వో వెంకటరమణ, ఆర్డీవో చిన్నికృష్ణ, జయరాం, ఎస్డీసీలు ప్రమీలాగాంధీ, అనిత, జ్ఞానవేణి, రామలక్ష్మి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్జేడీ జ్యోతికుమారి ఆకస్మిక తనిఖీ



విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

చోడవరం రూరల్: మండలంలోని పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, మండల విద్యాశాఖాధికారి కార్యాలయాలను సంయుక్త సంచాలకులు ఎం.జ్యోతికుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె పర్యటనలో భాగంగా జుత్తాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిన్నారి డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకంలో వంట పదార్థాలను పరిశీలించి, విద్యార్థులకు స్వయంగా వడ్డించి రుచిగా ఉన్నాయా అంటూ విద్యార్థులను ప్రశ్నించి వారి సమాధానంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడి నుంచి గజపతినగరం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థులను పలు పాఠ్యాంశాల పట్ల ప్రశ్నించి వారు రాసిన వర్క్‌బుక్స్‌లో కరెక్షన్లను పరిశీలించారు. తర్వాత స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చేరుకుని 9వ తరగతి ఫార్మేటివ్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షలో చదువులో వెనుకబడిన విద్యార్థులను ఏ రీతిలో ముందు వరుసలోకి తీసుకురావాలో దిశానిర్దేశం చేశారు. ఉపాధ్యాయులు నిర్వహించే అన్నీ రికార్డులను తనిఖీ చేశారు. లెసన్ ప్లానింగ్, టీచింగ్ డైరీలు రాయాలని, టీచింగ్ ఎట్ రైట్ లెవల్, లిప్, బైజూస్ కార్యక్రమాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఉపాధ్యాయులకు ఉద్బోధించారు. ఆర్జేడీ పర్యటనలో మండల విద్యాశాఖాధికారులు జయలక్ష్మి, సింహాచలం, ఆర్జేడీ సహాయకులు డి.శ్రీను, ప్రధానోపాధ్యాయులు వీవీ శేషగిరిరావు, ఐ.రామిరెడ్డి, సీఆర్‌పీ కేవీ మహాలక్ష్మినాయుడు, అకౌంటెంట్ రవిశంకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి

గోపాలపట్నం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంట కృష్ణ(47) నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విమాన్‌నగర్‌లో నివాసముంటున్న గంటా కృష్ణ చోడవరం మండలం జన్నవరంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి విధులు పూర్తి చేసుకుని ఇంటికి బయలుదేరారు. ఎన్‌ఏడీ జంక్షన్‌లో బస్సు దిగి ఆటోలో విమాన్‌నగర్ బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నాడు. రోడ్డు దాటుతుండగా ఎన్‌ఏడీ నుంచి వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో తలకు, శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నగరంలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం కృష్ణ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్ పర్యవేక్షణలో ఎస్‌ఐ మోహనరావు దర్యాప్తు చేట్టారు.

35 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్ట్



పట్టుబడ్డ సారా

రావికమతం: సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు రావికమతం ఎస్‌ఐ ఉమా మహేశ్వరరావు బుధవారం తెలిపారు. కుముందానిపేటలో సారా తయారీ చేస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేయగా 35 లీటర్ల సారాని బైక్‌పై తరలిస్తూ కుముందానిపేట గ్రామానికి చెందిన ముచ్చకర్ల గోవిందు, పాచిల కోటేశ్వరరావు పట్టుబడ్డారన్నారు. వారిద్దరిని అరెస్ట్ చేసి సారాతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వివాహితపై లైంగికదాడి : నిందితుడికి రిమాండ్

సబ్బవరం: మండలంలోని నారపాడు గ్రామంలో వివాహితపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్టు పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన రాజాన అప్పారావు(36) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మానసిక వైకల్యంతో ఉన్న మహిళపై అత్యాచారం చేసినట్టు చెప్పారు. వారం రోజుల కిందట బాధితురాలి భర్త గ్రామంలో లేని సమయంలో మధ్యాహ్నం ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడన్నారు. విషయం బహిర్గతం కాకుండా పెద్దలు న్యాయం చేస్తారనడంతో వెంటనే ఫిర్యాదు ఇవ్వలేదని, అయితే నిందితుడి నుంచి సరైన స్పందన రాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈమేరకు ఎస్‌ఐ ఎల్.సురేష్ కేసు నమోదు చేశారన్నారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిని అరెస్ట్ చేసి సీఐ రంగనాథం జుడీషియల్ రిమాండ్‌కు తరలించారని చెప్పారు. సమావేశంలో సీఐ రంగనాథం, ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని కార్మికుడి మృతి



పరిశీలిస్తున్న ఎస్‌ఐ దీనబంధు

రాంబిల్లి: సెజ్ ప్రాంతంలో లారస్ కంపెనీ సమీపంలో ఇసుక లారీ ఢీకొట్టిన ప్రమాదంలో లాలంకోడూరుకు చెందిన లాలం కిరణ్‌కుమార్(22) మృతి చెందాడు. ఎస్‌ఐ దీనబంధు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి. బుధవారం కిరణ్‌కుమార్ విధులు ముగించుకొని తన బైక్‌పై లాలం కోడూరు వెళ్తుండగా లారస్ 6 కంపెనీ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమైన కిరణ్‌ను తొలుత అచ్యుతాపురం గల ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కిరణ్‌కుమార్ మృతి చెందాడని ఎన్టీఆర్ వైద్యులు ధ్రువీకరించినట్టు ఎస్‌ఐ తెలిపారు. కిరణ్‌కుమార్ తండ్రి సన్యాసిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రెండు పశువుల వ్యాన్ల పట్టివేత

57 ఆవులు గోశాలకు తరలింపు



పోలీసులు పట్టుకుని మార్కెట్ యార్డ్ వద్ద ఉంచిన ఆవులు

నక్కపల్లి/పాయకరావుపేట: పశువుల అక్రమ రవాణా ఆగడం లేదు. గోమాతలను అక్రమంగా తరలించడం యధేచ్ఛగా జరిగిపోతోంది. ఆవులతోపాటు, గేదెలను సయితం కబేళాలకు తరలిస్తున్నారు. ఇలా తరలిస్తున్న రెండు వ్యాన్‌లను పాయకరావుపేట పోలీసులు బుధవారం పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ అప్పలరాజు తెలిపారు. వీటిలో ఉన్న 57 ఆవులను బందోబస్తు మధ్య సింహాచలం గోశాలకు తరలించామన్నారు. బుధవారం ఉదయం తాండవ జంక్షన్ వద్ద టిఎస్11యుబి7433 వ్యాన్‌లో41 ఆవులు, సీతారాంపురం వద్ద ఏపి 39 యు ఎఫ్5800 నంబరు గాల వ్యాన్‌లో 16 పశువులను తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్‌ఐ రమేష్ తమ సిబ్బందితో కలసి ఈ వ్యాన్‌లను అడ్డగించి కేసు నమోదు చేసి పశువులను మార్కెట్ యార్డ్ వద్ద ఉంచారు.

వారాహి యాత్ర.. అంతా రహస్యం!

- పవన్ టూర్ షెడ్యూల్‌పై గోప్యం
- జనవాణి కార్యక్రమంపైనా అదే గుట్టు
- వివరాలు వెల్లడించని జనసేన నేతలు

సాక్షి, విశాఖపట్నం: అంతా రహస్యం.. పవన్ కల్యాణ్ చేపడుతున్న మూడో విడత వారాహి విజయ యాత్ర అంతా గోప్యం..! గురువారం నుంచి 19వ తేదీ వరకు జనసేన అధినేత పవన్ ఉమ్మడి విశాఖలో వారాహి విజయ యాత్రను నిర్వహిస్తున్నారు. అయితే ఆయన యాత్ర ఏ రోజు? ఎక్కడ? ఉంటుందో ఆ పార్టీ నాయకులు వెల్లడించకుండా గోప్యత పాటిస్తున్నారు. సాధారణంగా ఏ పార్టీ అధినేత పర్యటన జరిపినా వాటి వివరాలను ముందుగానే ప్రకటిస్తారు. కానీ అందుకు భిన్నంగా వారాహి యాత్రను అంతా రహస్యంగానే ఉంచుతున్నారు. పవన్ తన యాత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసాలను, అవినీతి, అక్రమాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. వాటి వివరాలనూ గుట్టుగానే ఉంచారు. అంతేకాదు.. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఉద్దేశించిన జనవాణి కార్యక్రమాన్ని నగరంలో చేపడతారని చెప్పారు. అదెక్కడో? ఎప్పుడో? ఏ సమయానికో చెప్పకుండా గోప్యతనే పాటిస్తున్నారు. దీనిపై జనసేన నాయకులు మాట్లాడుతూ.. ఒక రోజు ముందుగా అధిష్టానం నుంచి యాత్ర షెడ్యూలు వస్తుందని, అప్పటి వరకు తాము ఏ వివరాలు చెప్పలేమని చెబుతున్నారు. మరోవైపు అధిష్టానం నుంచి ఆ పార్టీ నాయకులకూ యాత్ర షెడ్యూలు ముందుగా తెలియకుండా జాగ్రత్త పడుతున్నారన్న ప్రచారమూ ఉంది. పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పుకునే వారాహి యాత్ర షెడ్యూల్‌పై గోప్యత ఎందుకోనన్నది చర్చనీయాంశంగా మారింది.

పవన్ సభకు షరతులతో అనుమతి

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మూడో విడత వారాహి విజయ యాత్ర విశాఖ జిల్లాలో గురువారం నుంచి ప్రారంభం కానుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి శివశంకర్, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. బుధవారం మీడియా సమావేశంలో యాత్ర గురించి వివరించారు. ఈనెల 19 వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ యాత్ర ఉంటుందని, 15న మంగళగిరిలో జెండా వందనం చేస్తారన్నారు. యాత్రలో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు జగదాంబ జంక్షన్‌లో జరిగే బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగిస్తారన్నారు. ఈ సభకు పోలీసులు షరతులతో కూడిన అనుమతులిచ్చారన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహిస్తామన్నారు. కొన్నిచోట్ల పోలీసులు సెక్షన్ 30 పేరిట అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పీఏసీ సభ్యుడు కోన తాతారావు, ఆ పార్టీ నాయకులు మూగి శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తగరంపూడిలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని తగరంపూడి గ్రామంలో గురువారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరై, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, స్థానిక సమస్యలను తెలుసుకుని, సత్వర పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు హాజరుకావాల్సిందిగా కోరారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

అనకాపల్లిటౌన్: మండలంలో కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల ఆవరణలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి సమస్యలపై అవగాహన, ఉచిత కంటి పరీక్షలు జరిగాయి. సొసైటీ జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు ఎల్‌వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ బృందం 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, ఐడ్రాప్స్ అందించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రాఘవరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

12న టీచర్ల మహాధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో చైర్మన్ చిన్నబ్బాయి

అనకాపల్లి రూరల్: ఈ నెల 12న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నాకు టీచర్లంతా హాజరై విజయవంతం చేయాలని ఫ్యాప్టో చైర్మన్ గొంది చిన్నబ్బాయి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లు కావస్తున్నా ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సీపీఎస్ రద్దు, జీవో 117 సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు వై సుధాకర్‌రావు, ఎస్.సన్యాసినాయుడు, రవీంద్రబాబు, సీహెచ్ నాగేశ్వరరావు, ప్రేమ్ కుమార్, వత్సవాయి శ్రీలక్ష్మి, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
మెగ్ 2	: సత్యనారాయణ స్క్రీన్-1
సూర్య s/ o కృష్ణన్	: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	: షిర్డిసాయి
బ్లడ్-చాక్లెట్	: పర్దిసాయి
ఎల్‌జీఎం	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	: శ్రీసత్య
బ్రో	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 70 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	3,950	4,410
మూడోరకం	3,860	3,890

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 50 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-19 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 405 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఆల్బెండజోల్‌తో 'నులి'మేద్దాం!

- నులి పురుగులతో చిన్నారుల్లో రక్తహీనత
- నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం
- 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పిల్లల్లో చాలా అనారోగ్యాలకు కారణం నులి పురుగులేనంటే అతిశయోక్తి కాదు. ఇవి పిల్లల పేగుల్లో తిష్టవేసి, వారు తీసుకున్న ఆహారంలోని పోషకాలను గ్రహిస్తూ వృద్ధి చెందుతాయి. పిల్లల్లో రక్తహీనతకు కారణమవుతున్నాయి. దీని నివారణకు ఆల్బెండజోల్ మాత్రను వేసుకుంటే చాలు. పీహెచ్‌సీల పరిధిలోని 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నేటి నుంచి మాత్రలు వేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది.

అనకాపల్లి రూరల్ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి మండల పరిధిలోఏర్పాట్లు పూర్తయ్యాయి. పిల్లల్లో సాధారణంగా 3 రకాల నులి పురుగులు కనబడతాయి. అవి ఏలిక పాములు, నులి పురుగులు, కొంకి పురుగులు. పిల్లల్లో 50 నుంచి 60 శాతం మంది ఏదో ఒక రకం నులి పురుగుల బారిన పడి రక్తహీనత, అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు. ఇలాంటి రుగ్మతలను నివారించేందుకు ప్రభుత్వం ఏటా నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం చేపడుతోంది. 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసువారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తోంది. ఈ నెల 10(గురువారం) నుంచి 2 విడతలుగా ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. 17న మాప్ అప్ డే నిర్వహిస్తారు. అనకాపల్లి మండలంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో మాత్రలు పంపిణీ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్ణయించారు.

తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో..

అంగన్‌వాడీ కేంద్రాలు:	37
ఎంపీపీ స్కూళ్లు:	27
యూపీ స్కూళ్లు:	2
హైస్కూళ్లు:	6
కళాశాలలు:	1
హాస్టళ్లు:	1
ప్రైవేటు స్కూళ్లు:	5
మాత్రలు వేసుకోవాల్సిన పిల్లలు:	5262
అందుబాటులో ఉన్న మాత్రలు:	6000



తుమ్మపాల పీహెచ్‌సీకి చేరుకున్న ఆల్బెండజోల్ మాత్రలు

ఎలా వ్యాపిస్తాయంటే..

చిన్నారులు మట్టిలో ఆడుకుని, అదే చేత్తో ఆహార పదార్థాలు తినడం వల్ల మట్టిలో ఉన్న నులి పురుగులు నోటి ద్వారా పేగుల్లోకి చేరుతాయి. అవి క్రమంగా పెరిగి కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలకు దారి తీస్తాయి. చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు మూల కారణం పేగుల్లో ఏలిక పాములు, నులి, కొంకి పురుగులు చేరడమేనని వైద్య నిపుణుల అంచనా. పిల్లలు తినే ఆహారాన్ని ఈ నులి పురుగులు పొట్టలోని పేగుల నుంచి తీసుకుని అవి వృద్ధి చెందుతాయి. వీటి మూలంగా పిల్లలకు పోషకాహారం అందక, రక్తహీనతకు దారి తీస్తుంది. నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలే కాకుండా చిన్నారులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని వైద్యాధికారులు చెప్తున్నారు.

పరిశుభ్రతతోనే నివారణ

బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకూడదు. ఎల్లప్పుడూ మరుగుదొడ్డినే వాడాలి. భోజనం చేసే ముందు, మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. బూట్లు, చెప్పులు ధరించాలి. గోర్లను చిన్నవిగా కత్తిరించుకుని, ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రమైన నీటినే తాగాలి. పండ్లను, కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వీటి నుంచి పిల్లలను సంరక్షించుకోవచ్చు.

జ్వరం ఉంటే వద్దు

అధిక జ్వరంతో బాధపడుతున్న చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయవద్దని వైద్య సిబ్బందికి అధికారులు సూచించారు. అనారోగ్యంతో బాధపడే సమయంలో మాత్రలు వేసుకుంటే, దుష్ఫలితాలు వచ్చే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. వైద్య శాఖ మార్గదర్శకాల మేరకు 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసు వారికి ఈ మాత్రలు ఇస్తారు. 1 నుంచి 2 ఏళ్లలోపు చిన్నారులకు సగం మాత్ర పొడిగాచేసి నీళ్లలో కలిపి ఇవ్వాలి. 2-3 ఏళ్లలోపు చిన్నారులకు పూర్తి మాత్ర నీళ్లలో కలిపి ఇస్తారు. 3 నుంచి 19 ఏళ్ల లోపు వయసువారు పూర్తి మాత్రను బాగా నమిలి, మింగాలి.



అనకాపల్లిలో డీవార్మింగ్‌డే పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైద్యాధికారులు

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



జ్వరం ఉన్నవారు మినహా 1 నుంచి 19 ఏళ్లలోపు వయసున్న ప్రతీ ఒక్కరూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి తమ పిల్లలకు మాత్రలు వేయించాలి. మాత్రలను సబ్ సెంటర్లకు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు అందించాం. మాత్రలు వేసే సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత మాత్రమే వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలు వేసుకోవాలి. మాత్రలు వేసుకున్న తర్వాత స్వల్పంగా కడుపు నొప్పి, దురదలు వస్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలి.

– డాక్టర్ ఎస్‌కే నజ్రత్ షమీమ్, వైద్యాధికారి, తుమ్మపాల పీహెచ్‌సీ

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి



బంగారయ్యపేటలో సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

కశింకోట: ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట బీసీ కాలనీలో రెండో రోజు బుధవారం రాత్రి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వారీగా సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. స్థానిక సమస్యలను ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందనివారు, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేస్తే వాటిని మంజూరు చేస్తామన్నారు. ఇంటింటి కుళాయిలు ఇవ్వాలని, మురికి కాలువలు నిర్మించాలని ఈ సందర్భంగా మంత్రిని స్థానికులు కోరారు. దీనికి స్పందించిన ఆయన జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కుళాయిలు వేస్తామన్నారు. త్వరితగతిన మురికి కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించిన అంచనాలు తయారు చేసి నివేదించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అభ్యర్థించారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టి ఆశీర్వదించి, మంత్రికి ఘన స్వాగతం పలికారు.

కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, అద్దంకి సతీష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, పాల సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, పార్టీ నాయకులు ఇందల ముసిలినాయుడు, చిన్ని జనార్దన్ పాల్గొన్నారు.

త్వరితగతిన జల్ జీవన్ మిషన్ పనులు

అధికారులతో సమీక్షలో ఎంపీపీ గొర్లి సూరిబాబు



ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష జరుపుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్: జల్ జీవన్ మిషన్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనుల పురోగతిపై ఆయన అధికారులు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య అంశాల్లో ఒకటైన జల్ జీవన్ మిషన్ పనులపై నిర్లక్ష్యం చూపవద్దని, ఈ నెల 15లోగా వాటిలో కొన్నింటిని పూర్తి చేయాలన్నారు. ఇటీవల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నియోజకవర్గ సమీక్ష జరిపినపుడు జల్ జీవన్ మిషన్ పనులకు సంబంధించి ఇచ్చిన ఆదేశాల ప్రకారం అధిక ప్రాధాన్యతనిచ్చి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిని అధికారులు వివరించారు. మండలంలోని 32 పంచాయతీల్లో 101 గ్రామాల్లో సుమారు రూ.19.50 కోట్లతో 121 జల్ జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయన్నారు. వీటిలో 48 పనులు పూర్తికాగా, 12 పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని, మరో 48 పనులకు త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నీటి సరఫరాకు కీలకమైన ట్యాంకుల నిర్మాణం, బోర్‌వెల్స్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ డీవీవీ నాగేశ్వరరావు, ప్రాజెక్ట్స్ డీఈఈ భారతి, ఏఈఈ కె.శ్రీనివాస్, ఎస్‌డబ్ల్యూపీసీ జిల్లా ఇన్‌చార్జి నాగలక్ష్మి, ఎంపీడీవో కేవీ నర్సింహారావు పాల్గొన్నారు.

బీజేపీ పాలనపై ప్రజా సంఘాల కన్నెర్ర



ధర్నాలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి రూరల్: క్విట్ కార్పొరేట్, సేవ్ ఇండియా నినాదంతో ప్రధాని మోదీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ అనకాపల్లి బస్టాండ్ వద్ద కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన జరిగింది. సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏఐటీయూసీ నాయకుడు వైఎస్ భద్రం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, కార్పొరేట్లకు భుజం కాస్తోందని ఆరోపించారు. ఇకపై కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించకపోతే దేశం అధోగతి పాలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ 9 ఏళ్ల పాలనలో కార్మికుల సమస్యలు ఏవీ పరిష్కారం కాలేదని ఆక్షేపించారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, చేతివృత్తుల సమన్వయక మిటీ కన్వీనర్ గంటా శ్రీరామ్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు హరినాథ్‌బాబు పాల్గొన్నారు.

సీఆర్‌ఎంటీలుగా సీఆర్పీల నియామకంపై హర్షం

అనకాపల్లిటౌన్: క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్‌గా పని చేస్తున్న తమను ఉపాధ్యాయ వృత్తిలోకి తీసుకురావడం ఆనందంగా ఉందని ఏపీ సీఆర్పీ హక్కుల సాధన సమితి నాయకుడు పూడి వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమగ్ర శిక్షకు సంబంధించి మండల వనరుల కేంద్రాల్లో నడుస్తున్న సీఆర్పీ(క్లస్టర్ రిసోర్స్ పర్సన్)లను ఇకపై సీఆర్‌ఎంటీ(క్లస్టర్ రిజర్వ్‌డ్ మొబైల్ టీచరు)లుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీవో నెంబర్ 65 విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమను గుర్తించి, మెరుగైన అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



గ్యాస్ లీక్ నుంచి వస్తున్న మంటల్ని మహిళ చేత అదుపు చేయిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లిటౌన్: అగ్నిప్రమాదాలు, వాటి నియంత్రణపై స్థానిక సత్యసాయి సేవాసమితి మందిరంలో బుధవారం అగ్నిమాపక అధికారులు డెమో నిర్వహించారు. అగ్నిమాపక అధికారి బి.నర్సింగరావు అగ్ని ప్రమాదాల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

గ్యాస్ లీకేజీ సమయంలో మంటలు వ్యాపిస్తే వాటిని ఎలా అదుపులోకి తీసుకురావచ్చో అగ్నిమాపక సిబ్బంది స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు వైశ్యరాజు కృష్ణంరాజు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ అన్నం శివరాజశేఖర్, సమితి కన్వీనర్ కేవీఎస్ రామ్మూర్తి, కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళలు, సాయి భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా లలితాదేవి కలశ ఊరేగింపు



గవరపేటలో లలితాదేవి కలశ ఊరేగింపు



శారదానదిలో ప్రత్యేక పూజలతో కలశ నిమజ్జనం

కశింకోట: కశింకోటలోని గవరపేటలో ఉన్న శారదా గణపతి రామాలయంలో ఏర్పాటు చేసిన లలితాదేవి కలశ నిమజ్జనోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి రోజున లలిత సహస్ర నామ పారాయణ కార్యక్రమాన్ని మండల దీక్షగా జరిపారు. 41 రోజులపాటు జరిగిన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. దీంతో కలశాన్ని భజనలతో ఊరేగించి, పూజలు జరిపి శారదా నదిలో నిమజ్జనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా కాపు సంక్షేమ సేన ఆవిర్భావ వేడుకలు



కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక దినోత్సవాన కేక్ కట్ చేసి తినిపిస్తున్న నగిశెట్టి గంగబాబు

అనకాపల్లిటౌన్: స్థానిక కోట్నివీధి కల్యాణమండపంలో కాపు సంక్షేమ సేన మూడవ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని సేన జిల్లా అధ్యక్షుడు నగిశెట్టి గంగబాబు బుధవారం రాత్రి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేన వ్యవస్థాపకులు హరిరామ జోగయ్య పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక పోషించేలా కాపులందరినీ ఒక్క తాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేన జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లవిల్లిరామ కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కాశివ శంకర్రావు, జిల్లా యూత్ అధ్యక్షుడు యల్లంశెట్టి చిరంజీవి, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులపై నేడు బీజేపీ ధర్నా



విలేకరులతో మాట్లాడుతున్న మాలకొండయ్య

అనకాపల్లిటౌన్: కేంద్రం విడుదల చేసిన గ్రామ పంచాయతీ నిధులను తక్షణమే పంచాయతీ ఖాతాల్లో జమచేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నెహ్రూచౌక్ వద్ద జిల్లా పంచాయతీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ మేరకు స్థానిక చదువులవారి వీధి పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో కేంద్రప్రభుత్వం జమచేసిందన్నారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి పాలనలో గ్రామపంచాయతీలకు కేటాయించిన నిధులను 90 శాతం గ్రామాల్లో అక్కడి ప్రజల కోరిక మేరకు సభలు నిర్వహించి, గ్రామాల అభివృద్ధికి ఖర్చుచేసేవారని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయడం అభినందనీయమని, కానీ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రామపంచాయతీ నిధులను గ్రామాలకే వినియోగించాలన్నారు. రాష్ట్రంలో మొదటి దశలో 11 రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేసేందుకు మోదీ వర్చువల్ విధానంలో పనులకు శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 646 గ్రామపంచాయతీలకు కేంద్రం రూ.29 వేలకోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కొండబాబు, బొడ్డేడ నాగేశ్వరరావు, నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

అనకాపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10 నుంచి విద్యుత్ కార్మికులు చేపట్టనున్న సమ్మెకు సీఐటీయూ మద్దతు ప్రకటించినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ ఉద్యోగ, కార్మికులను బుధవారం కలిసి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించేందుకు పనిచేస్తున్న విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

'నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం'

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో ఆజాదీ కా అమృత్ వార్షికోత్సవంలో భాగంగా నా భూమి- నా దేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం ప్రతిజ్ఞ నిర్వహించారు. బొద్దపువాని చెరువు వద్ద సర్పంచ్ వెన్నల అప్పారావు, సచివాలయ ఉద్యోగులు, ఎన్జీఎస్ సిబ్బంది, వలంటీర్లు మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఉపసర్పంచ్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

అనకాపల్లిటౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 19 మంది వాహనదారులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను చెప్పారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా 19 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై సమీపంలోని పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజలను కోరారు.

మహిళలకు వజ్రాయుధం దిశయాప్

- అసాంఘిక కార్యకలాపాలపై నిఘా
- డీఎస్పీ సత్యనారాయణ



సబ్బవరం: మహిళలు, బాలికలపై ఎవరైనా దాడులు చేసినా, అసభ్యకరంగా ప్రవర్తించినా తీవ్రమైన చర్యలు తప్పవని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్ వజ్రాయుధంలా ఉపయోగపడుతుందన్నారు. దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీస్‌లకు సమాచారం అందిస్తే పోలీసులు వారికి రక్షణగా నిలుస్తారని చెప్పారు. జాతీయ రహదారులను ప్రమాదరహితంగా తీర్చిదిద్దేందుకు హైవే పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతూ ఉండాలని అనకాపల్లి ఎస్పీ ఆదేశించినట్లు తెలిపారు. దీంతో సబ్బవరంలోని జాతీయ రహదారితో పాటు దానికి అనుసంధానమైన ప్రధాన రహదారుల్లో నిత్యం హైవే పెట్రోలింగ్ వాహనం తిరుగుతూ పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహిస్తోందన్నారు. వీటితో ప్రధాన రహదారుల్లో ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి రేడియం స్టిక్కర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు డీఎస్పీ చెప్పారు. గంజాయి అక్రమ రవాణా మండలం మీదుగా వెళ్లకుండా నిత్యం నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి అక్రమ తరలింపులో భాగస్వాములుగా ఉన్న పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టి, రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. యువత రాత్రి సమయాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని హెచ్చరించారు. దీనిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న పిల్లలు, మహిళల హక్కులను కాపాడి వారికి నిరంతరం రక్షణగా నిలవడం జరుగుతుందన్నారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ జరగకుండా కళాశాలలు, స్కూళ్ల వద్ద మహిళా పోలీస్‌లను మఫ్టీలో ఉంచామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

విద్యార్థులతోనే సైబర్ క్రైం నిర్మూలన



విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు, అధ్యాపకులు, రిసోర్స్‌పర్సన్

అనకాపల్లిటౌన్: ప్రపంచంలో సైబర్ క్రైం నిర్మూలన విద్యార్థులతో సాధ్యపడుతుందని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు అన్నారు. కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి వర్క్‌షాపులు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ రిసోర్స్‌పర్సన్ చిగురుపాటి కిరణ్, సీఎస్‌ఈ విభాగాధిపతి సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.